
# టాప్ గేర్‌లో.. గెలుపే లక్ష్యంగా..

**జిల్లాలో అన్ని స్థానాల్లో విజయఢంకా మోగించేందుకు బీఆర్ఎస్ వ్యూహం**

- ఈ నెల 15న ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్న సీఎం కేసీఆర్
- బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు తలమునకలు
- ఘన విజయానికై చేవెళ్ల, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు ఇన్‌చార్జీల నియామకం
- సమన్వయంతో ప్రచారం నిర్వహించేలా కార్యాచరణ
- ఇన్‌చార్జీల నేతృత్వంలో ప్రచారంలో మరింత దూకుడు ప్రదర్శించనున్న పార్టీ శ్రేణులు




రంగారెడ్డి, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ స్థానాల గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ అన్ని వ్యూహాలను సిద్ధం చేస్తున్నది. కాంగ్రెస్, బీజేపీలను దీటుగా ఎదుర్కొంటూ ఓటర్ల మద్దతును కూడగట్టుకునేందుకు అవసరమైన ప్రచారానికి సంబంధించిన ప్రణాళికలను రూపొందిస్తున్నది. బీఆర్ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిని చేవెళ్ల, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలుగా బాధ్యతలను అప్పగించారు. మిగతా నియోజకవర్గాలకు త్వరలోనే ఇన్‌చార్జీలను నియమించనున్నారు. ఓ వైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు పార్టీ కార్యకర్తలు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు సీఎం కేసీఆర్ ఈ నెల 15న హుస్నాబాద్ వేదికగా ఎన్నికల శంఖారావాన్ని పూరించనుండడంతో బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారం మరింత హోరెత్తించనున్నది.

### ఇన్‌చార్జీల నేతృత్వంలో విస్తృతంగా..

చేవెళ్ల నియోజకవర్గానికి ఎంపీ రంజిత్‌రెడ్డిని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిని ఇన్‌చార్జీలుగా అధిష్టానం నియమించింది. ఇక నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి అవసరమైన కార్యాచరణను పక్కాగా అమలు చేయనున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఇన్‌చార్జీలు తమ బాధ్యతలను సంపూర్ణంగా నిర్వర్తించనున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసెంబ్లీ ఇన్‌చార్జీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరితో మమేకమయ్యేలా పార్టీ కార్యక్రమాలను చేపట్టనున్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించనున్నారు. ఓ వైపు పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను నిర్వర్తిస్తూనే.. మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కార్యక్షేత్రంలో శ్రమించనున్నారు.

### బీఆర్ఎస్‌కు సానుకూల వాతావరణం

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ దూకుడు ప్రదర్శిస్తున్నది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకమునుపే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి జిల్లా మంత్రి సబితా ఇంద్రారెడ్డితోపాటు, ఎమ్మెల్యేలంతా నియోజకవర్గాలను చుట్టివచ్చారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నేతలతో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణుల్లో కదనోత్సాహాన్ని నింపుతున్నారు. కాలనీల అసోసియేషన్ కార్యవర్గాలతోనూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తున్నది. సిట్టింగ్‌లకే మళ్లీ అవకాశం ఇచ్చి వారిపై సీఎం కేసీఆర్ పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా ప్రజానీకం సైతం ఆదరిస్తున్నది.

మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇప్పటికే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఐదోసారి బరిలో నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు విస్తృతంగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. పార్టీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశాలు, కాలనీల అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. వీరంతా మరోసారి గెలుపు కోసం నిత్యం ప్రజలతో మమేకమవుతున్నారు. ఈ సందర్భంగా సబ్బండ వర్గాలు సైతం మద్దతు పలికి రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిపిస్తామని హామీ ఇస్తున్నారు. అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తుండడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేస్తున్నది. కాంగ్రెస్, బీజేపీల నుంచి చేరికలు సైతం భారీగా ఉంటుండడంతో బీఆర్ఎస్ అభ్యర్థుల ఘన విజయం ఖాయమన్న భావన ప్రతి ఒక్కరిలో కలుగుతున్నది.



కడ్తాల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు పాఠశాలల్లో వేడుకలు
- ఆడిపాడిన విద్యార్థినులు, ఉపాధ్యాయినులు
- అలరించిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. ఉపాధ్యాయ బృందంతో కలిసి బతుకమ్మ పాటలను ఆలపిస్తూ హుషారుగా ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. అంతకుముందు పాఠశాలల్లో విద్యార్థినులు నిర్వహించిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అట్టహాసంగా నిర్వహించిన వేడుకల్లో ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. నేటి తరం బతుకమ్మ, దసరా పండుగల ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. పూలను పూజించే గొప్ప సంస్కృతి మనదని చెప్పారు.

- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, అక్టోబర్ 13



కడ్తాల్ : బతుకమ్మలతో విద్యార్థినులు




తాండూరు : బతుకమ్మ ఆడుతున్న టీచర్లు, విద్యార్థినులు

కాంగ్రెస్, బీజేపీలో..

# ప్యారాచూట్ నేతల కలకలం

- ఇబ్రహీంపట్నంలో బూర సమావేశానికి స్థానిక నేతల డుమ్మా
- స్థానికేతరుడికి టికెట్ ఎలా ఇస్తారంటూ ప్రశ్నిస్తున్న నాయకులు
- కాంగ్రెస్‌లో టికెట్ నాదేనంటూ మరో నేత రాంరెడ్డి తిరుగుబావుటా
- మల్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేసిన ఫంక్షన్ హాల్లోనే సమావేశం నిర్వహణ



సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ)/ఇబ్రహీంపట్నం : ఏండ్ల తరబడి పార్టీని నమ్ముకున్న స్థానిక నేతలను కాదని.. ప్యారాచూట్ నేతలను అందలం ఎక్కించడంపై కాంగ్రెస్‌లోనే కాదు.. బీజేపీలోనూ నేతలు భగ్గుమంటున్నారు. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీజేపీలోనూ ఇదే కలకలం మొదలైంది. రెండు రోజుల కిందట ఆ పార్టీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ నియోజకవర్గంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దీనిపై ముందస్తుగానే అందరికీ సమాచారం ఇచ్చినప్పటికీ కీలక నేతలెవరూ హాజరు కాకపోవడం గమనార్హం. వాస్తవానికి ఆ పార్టీ నుంచి పలువురు స్థానిక నేతలు టికెట్ ఆశిస్తున్నారు. ఈమేరకు దరఖాస్తు కూడా చేసుకున్నారు. ఈ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న బూర నర్సయ్యగౌడ్ పరోక్షంగా సంకేతాలు పంపేందుకు రెండు రోజుల కింద ఇబ్రహీంపట్నంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి, అందరినీ ఆహ్వానించారు. పలువురు నేతలు, కార్యకర్తలు సమావేశానికి వచ్చినప్పటికీ కీలకమైన నేతలు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. అశోక్‌గౌడ్, అర్జున్‌రెడ్డి, బాషా, దయానంద్‌గౌడ్ తదితర ముఖ్య నాయకులు ఈ సమావేశానికి దూరంగా నిలవడంతో పాటు టికెట్ కేటాయింపుపై గళం విప్పుతున్నారు. ప్యారాచూట్ నేతకు టికెట్ ఎలా ఇస్తారంటూ వీరిలోని పలువురు నాయకులు ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో ఇప్పటిదాకా కాంగ్రెస్ శ్రేణులనే వెంటాడిన ఈ బెడద ఇప్పుడు కమలంలోనూ మొదలైందని జనం చర్చించుకుంటున్నారు.

### అదే ఫంక్షన్ హాల్‌లో..

మరో వైపు ఇబ్రహీంపట్నం కాంగ్రెస్‌లో అంతర్గత పోరు మరింత పెరుగుతున్నది. ఇప్పటికే రేవంత్ వర్సెస్ కోమటిరెడ్డిగా నడుస్తున్న ఈ టికెట్ వ్యవహారం ఇప్పుడు మాజీ పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కూడా అంటుకున్నది. తనకు సన్నిహితుడైన దండెం రాంరెడ్డి కోసం ఉత్తమ్ ప్రయత్నాలు చేస్తున్నారంటూ నియోజకవర్గంలో మరో చర్చ మొదలైంది. దీంతో రాంరెడ్డి తాజాగా శుక్రవారం తన వర్గం నేతలు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో మల్‌రెడ్డి రంగారెడ్డి సమావేశం నిర్వహించిన పెద్ద అంబర్‌పేటలోని తార కన్వెన్షన్ హాల్‌లోనే రాంరెడ్డి సమావేశం ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో రాంరెడ్డి వర్గం నేతలు టికెట్ తమ నేతకే ఖరారు చేశారంటూ బహిరంగంగానే ప్రకటనలు చేశారు. ఒకడుగు ముందుకేసి రాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలంటూ సమావేశంలో ప్రసంగించడంతో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్‌లో టికెట్ల పోరు తారాస్థాయికి చేరుకున్నట్లుగా తెలుస్తున్నది.

# విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ అడిషనల్ సెక్రెటరీ పార్వతీదేవి
- చిలుకూరు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళాశాల ప్రాంగణంలో 6బీ జోనల్ ప్రాంతీయ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



వాలీబాల్‌ను ప్రారంభిస్తున్న అడిషనల్ సెక్రెటరీ పార్వతీదేవి



క్రీడా ప్రాంగణంలో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

మొయినాబాద్, అక్టోబర్ 13 : విద్యార్థులు విద్యతోపాటు క్రీడా రంగంలోనూ రాణించినవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ అడిషనల్ సెక్రెటరీ పార్వతీదేవి అన్నారు. చిలుకూరు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళాశాల ప్రాంగణంలో 6బీ జోనల్ ప్రాంతీయ స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం అంగరంగవైభవంగా ప్రారంభించారు. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలోని 11 పాఠశాలల నుంచి క్రీడాకారులు 995 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె కార్యక్రమానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ పతాకాన్ని, గురుకుల విద్యా సంస్థ పతాకాన్ని, స్పోర్ట్స్ పతాకాన్ని ఆవిష్కరించి గాలిలోకి బెలూన్స్ వదిలి క్రీడను ప్రారంభించారు. క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ చేసి కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు, అతిథులకు గౌరవ వందనం చేశారు. అనంతరం వాలీబాల్ పోటీలను ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా వికారాబాద్, రంగారెడ్డి జిల్లా పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి డాక్టర్ శారదావెంకటేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ఏదో ఒక క్రీడపై ఆసక్తి పెంచుకొని శ్రద్ధతో పాల్గొంటే ఆ క్రీడలో రాణించగలుగుతారని పేర్కొన్నారు. క్రీడల్లో పోటీతత్వంతో పాల్గొనాలని సూచించారు. నేటి ఓటమి భవిష్యత్తులో గెలుపుపకు నాందిలాంటిదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను ఎంతో బలోపేతం చేసిందని చెప్పారు. గురుకుల విద్యాలయాల్లో సీటు పొందాలి అంటే నవోదయ పాఠశాలల తరహాలో తీవ్ర పోటీ ఉందని చెప్పారు. గురుకుల విద్యాలయాల్లో నాణ్యమైన విద్యతోపాటు, క్రీడా రంగాల్లో రాణిస్తూ మంచి క్రమశిక్షణ గల విద్యార్థిగా తీర్చిదిద్దబడుతున్నారని పేర్కొన్నారు. జోనల్ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గెలుపొందిన క్రీడాకారులు ఇంటర్ గురుకులాల క్రీడా పోటీల్లో పాల్గొనడంతోపాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత పొందుతారని చెప్పారు. క్రీడల్లో విద్యార్థులు ప్రతిభను కనబర్చితే చాలు.. వారు పాల్గొనడానికి కావాల్సిన ఖర్చులు గురుకుల విద్యా సంస్థ భరిస్తుందని, విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే గురుకుల విద్యా సంస్థ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌శంకర్, ఫిజికల్ డైరెక్టర్ ఆదిబాబు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, పీఈడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

# నగర సీపీగా సందీప్ శాండిల్య

- 10 మంది డీసీపీలు, జాయింట్ సీపీ బదిలీ
- జిల్లా కమిషనర్లు, ఎస్పీలుగా పోస్టింగ్




సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సందీప్ శాండిల్య నియమితులయ్యారు. నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన సీవీ ఆనంద్ ఇటీవల బదిలీ అయిన విషయం తెలిసిందే. కొత్త పోలీసు కమిషనర్‌ను ఎంపిక చేయడంలో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముగ్గురు అదనపు డీజీ ర్యాంకు అధికారుల పేర్లను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించారు. ప్రస్తుతం తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సందీప్ శాండిల్యాను నగర పోలీస్ కమిషనర్‌గా ఎంపిక చేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. 1993వ ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సందీప్ శాండిల్య 2005 నుంచి 2007 వరకు సౌత్‌జోన్ డీసీపీగా, 2012 నుంచి 2014 వరకు హైదరాబాద్ అదనపు పోలీస్ కమిషనర్(క్రైమ్స్)గా బాధ్యలు నిర్వర్తించారు. 2016లో సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేశారు. 2018 నుంచి రైల్వే ఏడీజీగా పనిచేసి.. అక్కడి నుంచి పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా వెళ్లారు. తాజాగా.. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమించారు.

### భారీగా ఐపీఎస్‌ల బదిలీ

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల కమిషన్ మరోసారి భారీగా ఐపీఎస్‌లను బదిలీ చేసింది. ఇందులో భాగంగా మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో 10 మంది డీసీపీలు, జాయింట్ సీపీ, అదనపు సీపీలను బదిలీ చేసి, ఇతర జిల్లాల్లో కమిషనర్లు, ఎస్పీలుగా పోస్టింగ్‌లు కల్పించింది. వివరాలిలా ఉన్నాయి. రాచకొండ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అంబర్ కిశోర్ ఝాను ఇక్కడి నుంచి బదిలీ చేసి, వరంగల్ కమిషనరేట్ ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. సైబరాబాద్ క్రైమ్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న కల్మేశ్వర్ సింగన్వర్‌ను అక్కడి నుంచి బదిలీ చేసి, నిజామాబాద్ కమిషనర్‌గా, హైదరాబాద్ సౌత్- ఈస్ట్ జోన్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న చెన్నూరి రూపేశ్‌ను ఇక్కడి నుంచి బదిలీ చేసి, సంగారెడ్డి జిల్లా ఎస్పీగా, తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ 4వ బెటాలియన్ కమాండర్ సీహెచ్. సింధు శర్మను బదిలీ చేసి, కామారెడ్డి ఎస్పీగా, సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ-1గా విధులు నిర్వర్తిస్తున్న హర్షవర్ధన్‌ను ఇక్కడి నుంచి బదిలీ చేసి, మహబూబ్‌నగర్ ఎస్పీగా, సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న రితిరాజ్‌ను అక్కడి నుంచి బదిలీ చేసి, జోగులాంబ ఎస్పీగా, సైబరాబాద్ అడ్మిన్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న యోగేశ్ గౌతమ్‌ను అక్కడి నుంచి బదిలీ చేసి, నారాయణపేట ఎస్పీగా పోస్టింగ్ కల్పించారు. కొత్త ప్రాంతాల్లో పోస్టింగ్‌లు పొందిన అధికారులు వెంటనే తమకు కేటాయించిన పోస్టుల్లో చేరాలని ఉత్తర్వులు జారీ చేశారు.